క్లుప్తంగా

ఇంట్లోకి చేరిన వరదనీరు



శాయంపేట : మండలంలో శనివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పలువురి ఇళ్లలోకి వరద నీరు చేరింది. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి రాజేశ్ ఇంటి ఎదుట సైడ్‌డ్రెయినేజీలో మొరం పోసి వదిలేయడంతో భారీ వర్షానికి వరద నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఇంట్లోకి నీరు చేరి సామాగ్రి తడిసిందని బాధితుడు వాపోయాడు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

కార్యకర్తలను వేధిస్తే గుణపాఠం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

● మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ : పరకాల నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ శ్రేణులను వేధిస్తే గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఊకల్ క్రాస్ రోడ్డు సమీపంలోని ఎస్‌ఎస్ గార్డెన్స్‌లో గీసుకొండ, సంగెం మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, క్రియాశీల కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులను కొందరు కాంగ్రెస్ నాయకులు పలు రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని, అలాంటి వారికి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక గోరీ కడతామన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌లో పదవులను అనుభవించి స్వప్రయోజనాలే లక్ష్యంగా పార్టీ మారిన నాయకులు కాళ్లు మొక్కినా వారిని మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి తీసుకునే ప్రసక్తే లేదని తేటతెల్లం చేశారు. సంగెం మండలంలో రైతులు యూరియా కావాలని అడిగితే అక్రమంగా కేసులు బనాయించారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, ఎస్‌ఐకి సిగ్గుందా? అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్లలో డీజిల్ పోసేందుకు డబ్బులు లేవని అధికారులు చెబుతుండడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని చెప్పారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు పోలీసు ధర్మారావు, సుదర్శన్‌రెడ్డి, 15వ డివిజన్ కార్పొరేటర్ మనోహర్, పీఏసీఎస్ చైర్మన్ కొల్లూరి రవీందర్, మాజీ సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాశ్, పూంద్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, నాయకులు సారంగపాణి, సుంకరి శివ, సిరిసె శ్రీకాంత్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, రఘుపతి, గోలి రాజయ్య, ముంత రాజయ్య, కోట ప్రమోద్, ధనుంజయ, దొనికెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో రైతులను ఆదుకోవాలి

● మంత్రికి ఏఐకేఎఫ్ బృందం వినతి

నర్సంపేట : ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతులకు సరిపడా యూరియా, పంట రుణాలు, రూ.2 లక్షల రుణమాఫీ అందించి ఆదుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య, ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్, సహాయ కార్యదర్శి ఎస్‌రెడ్డి హంసారెడ్డి, ఏఐఏడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉపేందర్‌రెడ్డి, మల్లయ్య, రమేశ్, హంసారెడ్డి, కుమారస్వామి మాట్లాడారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే 40 శాతం తక్కువ పంటలు వేసిన క్రమంలో అందుకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళిక రూపొందించి పంట రుణాలు, ఎరువులు అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సరిపడా యూరియా దొరక్క రైతులు వేదనకు గురవుతున్నారని తెలిపారు. డీలర్లే కృత్రిమ కొరత సృష్టిస్తున్న దుస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్షతను మాని రాష్ట్ర కోటాకు అనుగుణంగా యూరియా పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతుగంటి కాశీ, వస్పుల కిరణ్, ఇమ్మానుయేల్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నర్సంపేట : నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన 13 బీఆర్‌ఎస్ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో ఆదివారం చేరాయి. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బూస కుమారస్వామి, తదితరులు పార్టీలో చేరగా వారికి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నల్లబెల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తిని మహేశ్, నాయకులు కొండి అశోక్, మాసంపెల్లి అఖిల్, తదితరులు ఉన్నారు.

అదనపు గదులు లేక అవస్థలు

● ఏళ్లు గడుస్తున్నా మారని గొల్లవాడ ప్రాథమిక పాఠశాల పరిస్థితి
● దృష్టిసారించని పాలకులు, అధికారులు



మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాల

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల కొరత వేధిస్తోంది. జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదుల లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలలో ఐదో తరగతి వరకు విద్యాబోధన కొనసాగుతుండగా 70కి పైగా విద్యార్థులు ఉన్నారు. ఆరుగురు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. అంతా బాగానే ఉన్నా ఐదు తరగతుల నిర్వహణకు కేవలం రెండే గదులు ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు మెరుగుపరుస్తామని, మెరుగైనా విద్య అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఈ పాఠశాల పరిస్థితి మాత్రం మారడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలం అవడంతో ఆరుబయట కూడా పాఠాలు చెప్పలేని పరిస్థితి ఉందని, దీంతో ఇరుకు గదుల్లోనే బోధన కొనసాగిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

● బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మోహన్



మాట్లాడుతున్న మోహన్

ఐనవోలు : అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ తంపుల మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కళ్లపల్లి చందర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఎంపీటీసీ స్థానాల సన్నాహక సమావేశాన్ని ముఖ్య నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌లు మహ్మద్ ఉస్మాన్ అలీ, పల్లకొండ సురేష్, జయశంకర్, జగపతిరాజు, కుమార్, లక్ష్మణ్, ఎల్లగౌడ్, అశోక్, రఘువంశీ, రాజు, వెంకటరమణ, సంతోశ్, యాకయ్య, అనిల్, రవి, రాజు, ప్రదీప్ పాల్గొన్నారు.

తాటివనంలో సోలార్ వెలుగులు



రాజేందర్, నారాయణరెడ్డిని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో గల తాటివనంలో సోలార్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. రాత్రి సమయంలో గీతకార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను గమనించిన గ్రామానికి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు వైనాల రాజేందర్ సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. కాగా మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గీతకార్మికులు రాత్రి సమయంలో పడుతున్న కష్టాలను చూసి సోలార్ లైట్లను ఏర్పాటు చేసిన రాజేందర్‌ను అభినందిస్తున్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలకు సేవ చేసేందుకు యువత ముందుకు రావడం శుభసూచికమన్నారు. అనంతరం రాజేందర్‌ను, నారాయణరెడ్డిని గౌడ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. గ్రామ గౌడ సంఘం నాయకులు సుదర్శన్‌గౌడ్, కొమురయ్య గౌడ్, మురళిగౌడ్, దేవేందర్‌గౌడ్, రాజమౌళి, రమేశ్, సాంబయ్య, రాజయ్య, సదయ్య, శ్రీనివాస్, కుమారస్వామి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

'స్థానికం'లో జెండా ఎగురవేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

దామెర : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు సాధించి జెండా ఎగురవేసే విధంగా కార్యకర్తలు కష్టపడాలని ల్యాదెళ్ల మాజీ సర్పంచ్ మాదాసు వెంకటేశ్వర్లు అన్నారు. గ్రామంలో ఆదివారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల మంజూరు తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ప్రజలు అండగా నిలిచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు కుమార్, రాజు, ప్రవీణ్, రమేశ్, జితెందర్, ఇందిర, రవియాదవ్, సమ్మయ్య, జగదీశ్, జగన్, అయిలయ్య పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఈశ్వరయ్య




మతిస్థిమితం కోల్పోయిన మంగేశ్‌కుమార్‌కు క్షవరం చేయిస్తున్న ఈశ్వరయ్య

శాయంపేట : మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన బూర ఈశ్వరయ్య మానవత్వం చాటుకున్నారు. మాందారిపేట గ్రామంలోని బస్టాండ్, హెచ్‌పీ పెట్రోల్‌పంప్ పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేని వ్యక్తి తిరుగుతుండగా ఆయన గమనించి చేరదీశారు. అతడికి క్షవరం, స్నానం చేయించి, కొత్త బట్టలు ఇప్పించి భోజనం తినిపించారు. వివరాలు తెలుసుకోగా మహారాష్ట్రలోని పూణేకు చెందిన మంగేశ్ కుమార్ అని, అతడు బీకాం చదువుకున్నట్లు తెలిపాడు. ఇంట్లో కుటుంబ సమస్యల వల్ల మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నట్లు ఈశ్వరయ్య తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఈశ్వరయ్యను అభినందించారు.

సంక్షిప్తంగా

సెంట్రింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా రమేశ్




జన్ను రమేశ్

కమలాపూర్ : స్వయంకృషి భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మిక సంఘం కమలాపూర్ పట్టణ అధ్యక్షుడిగా జన్ను రమేశ్ ఎన్నికైనట్లు భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పుల్లా శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సెంట్రింగ్ కార్మిక సంఘల పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శనిగరపు రాజేందర్, మాట్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా మాట్ల సాగర్, కార్యదర్శిగా మాట్ల ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా పుల్లా పున్నంచందర్, గౌరవ అధ్యక్షులుగా పుల్లా శ్రీనివాస్, శనిగరపు ఆనందం ఎన్నికైనట్లు పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులుగా అశోక్, మహేందర్, రాములు, ప్రకాశ్, రాజేందర్, కిశోర్, సంపత్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

చర్య తీసుకోవాలి

వేలేరు : సర్వే నంబర్లు మార్చి పట్టా భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని శాలపల్లి గ్రామానికి చెందిన రైతు కూరపాటి రమేశ్ అధికారులను కోరారు. గత ప్రభుత్వం హయాంలో వేలేరు వీఆర్‌ఓ, కొంతమంది పెద్దమనుషులు కలిసి శాలపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 1466ని మార్చి ఆ భూమిని ఆక్రమించుకుని, తమకు 1462లోని ప్రభుత్వ భూములకు సంబంధించిన అసైన్డ్ భూములు, కుంటలను రికార్డుల్లో నమోదు చేసి కట్టబెట్టారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నవచైతన్య యూత్ అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

వేలేరు : మండల కేంద్రంలో నవచైతన్య యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా కొడూరి శ్రీకర్, ప్రధాన కార్యదర్శిగా అక్కల ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్, కార్యదర్శులుగా మహేష్, శివప్రసాద్, కోశాధికారిగా పరమేశ్, సలహాదారులుగా మేక రాజు, శ్రీనివాస్, శంకర్, రాజు, రవి, రమేశ్‌లు ఎన్నికయ్యారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

దుగ్గొండి : శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పల్లెల్లో అపరిచితులు సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అనుమానితుల వివరాలు పోలీసులకు అందించాలని సూచించారు. సైబర్ నేరాలు, తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు, చైన్ స్నాచింగ్‌లపై వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నేరాలకు అడ్డుకట్ట వేయడంలో తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్‌ఐఓ) ప్రతినిధులు డిమాండ్‌చేశారు. హనుమకొండ సుబేదారిలోని కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఐఓ ఆధ్వర్యంలో సర్వే చేపట్టగా వరంగల్ నగరంలోని 14పైగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తక్కువ శాతం మూత్రశాలలు, అరకొరగా తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యం, ఇతర ప్రాథమిక వసతులు లేనట్లు సర్వేలో వెల్లడైనట్లు తెలిపారు. సర్వే వివరాల నివేదికను వరంగల్ కలెక్టర్ సత్యశారద, డీఈఓ జ్ఞానేశ్వర్‌కు అందజేసినట్లు వివరించారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

కాజీపేట రూరల్: కాజీపేట మండలం అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్‌టీ) రాష్ట్ర కార్యదర్శి జెరిపోతుల విల్సన్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొక్కల వెంకటస్వామి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ఆశీర్వాదం మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్‌కు చెందిన పలు ప్రాంతాలకు సోమవారం తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల మరమ్మతుల కారణంగా కొత్తవాడ, రంగంపేట, శ్రీనివాస కాలనీ, పోతన నగర్, రాజీవ్ కాలనీ, పాపయ్య పేట, రామన్నపేట, తీగల గుట్ట, గాయత్రి కాలనీ, వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, దత్తాక్షేత్రం ప్రాంతం, రఘునాథ కాలనీ, ఓఎస్ నగర్, పాతిక్ మహేలా, షేర్ పుర, ఎల్లంబజార్, బీట్ బజార్ తదితర ప్రాంతాల్లో ఒక రోజు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: వడ్డెపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని స్నేహనగర్ ఫీడర్‌లో మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 4.30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని హనుమకొండ డీఈ సాంబరెడ్డి ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని భవానీ నగర్, స్నేహనగర్, మసీదు, హనుమాన్ టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

విద్యారణ్యపురి: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి అన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేయూ సమీపంలోని హనుమాన్ నగర్‌లో మహిళా సంఘాల సభ్యులకు సఖి సెంటర్ సేవలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళలు, బాలికలకు ఐదు రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత కౌన్సెలింగ్, న్యాయ, వైద్య, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు వివరించారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు 'చల్లా'కు లేదు

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్



మాట్లాడుతున్న కమలాపురం రమేశ్

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూపి ఓర్వలేక బీఆర్‌ఎస్ పార్టీ విమర్శలు చేస్తుందని ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ రాధిక, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1977–78 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 48 సంవత్సరాల తర్వాత ఒకేచోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు హనుమంతరావు, బొందయ్య, వెంకటేశ్వరరావు, మధుసూదన్, విద్యాసాగర్‌ను శాలువాతో సన్మానించారు. నిమ్మ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమ్మేళనంలో 55 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని సంబురాలు చేసుకున్నారు.

పింఛన్ పెంచి మాట నిలబెట్టుకోవాలి



ధర్మసాగర్ : మాట్లాడుతున్న శ్రీనివాస్



ఐనవోలు : మాట్లాడుతున్న నారాయణ

ధర్మసాగర్ : పింఛన్‌దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, దివ్యాంగులకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. పింఛన్‌దారుల బాధలు ప్రభుత్వానికి కనిపించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రచురించిన మాదిరిగా వికలాంగులకు రూ.6 వేలు, చేయూత పింఛన్ రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. నాయకులు కొమురయ్య, కుమార్, ఎల్లయ్య, లక్ష్మయ్య, సుజాత, ఐలయ్య, కౌరినిషా, రాజు, లింగయ్య, బుచ్చయ్య, రజిత, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పాల్గొన్నారు.

ఐనవోలు : వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, బీడీ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌ను వెంటనే పెంచాలని ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ బొక్కల నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని కొండపర్తిలో పింఛన్‌దారుల గ్రామ కమిటీ సమావేశం ఆదివారం కట్కూరి శివ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా ఈనెల 29న వరంగల్ జిల్లా కేంద్రంలో పింఛన్‌దారుల సదస్సు ఉంటుందని తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి 100 మంది తరలిరావాలని పిలుపునిచ్చారు.

దామెర : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాగర్జన సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పులుకుర్తిలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగష్టు 13వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల చేయూత పింఛన్‌దారుల మహాగర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లిపై విమర్శలు సరికాదు

వర్ధన్నపేట : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల, పట్టణ కమిటీల అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి, గోధుమల మధుసూదన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో చెక్‌డ్యాంలు తెగిపోతే ప్రస్తుత ఎమ్మెల్యే శాశ్వత మరమ్మతులు చేయించలేదని చెప్పారు. ఎస్సారెస్పీ కాల్వల నుంచి సాగునీరు రాకపోవడంతో రైతులు 2 శాతం కూడా నాట్లు వేయలేదని తెలిపారు. సాగు నీరు మీద ఎమ్మెల్యే నాగరాజుకు కనీస అవగాహన లేదన్నారు. దయాకర్‌రావు కృషి ఫలితంగానే ఎస్సారెస్పీ కాల్వ మండలం నుంచి నిర్మితమయ్యిందని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టు కట్టి ఎస్సారెస్పీలోకి నీరు రాకుండా చేయగా దయాకర్‌రావు పోరాడారని, జైలు జీవితం గడిపారని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎండా కాలంలోనూ అన్ని చెరువులు, కుంటలను దేవాదుల నీటితో నింపిన చరిత్ర దయాకర్‌రావు సొంతమన్నారు. మాజీ ఎంపీపీ అప్పారావు, మాజీ వైస్ ఎంపీపీ, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నడికూడ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని పలువురికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ధర్మారంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన శివ, ప్రశాంత్ బైక్‌పై అంబాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నడికూడకు చెందిన సంపత్, నవీన్ బైక్‌పై కంఠాత్మకూరు పెట్రోల్‌బంక్ నుంచి నడికూడకు వస్తున్నారు. పరకాల–అంబాల ప్రధాన రహదారిపై అదుపుతప్పిన ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో క్షతగాత్రులను పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. కాగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

దామెర : బాల్యమిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థికసాయం అందించి బాసటగా నిలిచారు. పులుకుర్తికి చెందిన సరువు వేణు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అతడితో కలిసి 1996–1997లో పదో తరగతి చదివిన మిత్రులు ఆదివారం వేణు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. చంద్రమోహన్, రాజు ఉన్నారు.